క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజలో పాల్గొన్న నాయకులు

వి.కోట: మండలంలోని జవునపల్లి పంచాయతీ ఎగువపల్లి గ్రామంలో జెడ్పీ నిధులతో సీసీరోడ్ల నిర్మాణానికి జిల్లా సాంఘిక సంక్షేమ, సామాజిక సేవ సలహాదారుడు అమరనాథ్, సర్పంచ్ చలపతి శనివారం భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు నరేంద్ర, గిరిధర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


మృతదేహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్

రామకుప్పం: మండలంలోని ననియాల గ్రామానికి చెందిన చిన్నమునెమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ స్థానిక వైఎస్సార్‌సీపీ నేతల ద్వారా ఆర్థికసాయం అందజేశారు. స్థానిక సర్పంచ్ మల్లిక చిన్నమునెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధితురాలి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ నేతలు గోవిందప్ప, మురుగేష్, సతీష్ ఉన్నారు.

కక్షిదారులపై అదనపు భారం అన్యాయం

చిత్తూరు అర్బన్: కక్షిదారులు న్యాయస్థానాల్లో దాఖలుచేసే పిటిషన్లపై రూ.20 స్టాంపులను విధిగా అతికించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం అన్యాయమని న్యాయవాదుల సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. చిత్తూరులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఉమ్మడి జిల్లాలోని బార్ అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా చిత్తూరు బార్ నాయకులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు పిటిషన్లపై అతికిస్తున్న రూ.1 స్టాంపును యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు చనిపోతే అందుతున్న రూ.4 లక్షల ఆర్థికసాయాన్ని, రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

రూ.7.52 కోట్లతో అభివృద్ధి పనులు

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు
- నాడు- నేడు కార్యక్రమం ద్వారా కొత్త హంగులు
- ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ


శంకర్రాయలపేట పాఠశాలలో శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శనివారం పెద్దపంజాణి మండలంలో మొదట విడత నాడు–నేడు నిధులు రూ.7.52 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్కూళ్లలో మరుగుదొడ్లు లేక పిల్లలు అనేక అవస్థలు పడేవారని, రేకులు, దుప్పట్లు అడ్డుపెట్టుకునే పరిస్థితులుండేవని తెలిపారు. శిథిలమైన గదుల్లో ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ పాఠాలు బోధించేవారని, చాలీచాలని గదులతో విద్యార్థులు అవస్థలు పడేవారని పేర్కొన్నారు. వాటి అభివృద్ధి గురించి గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. నిధులు కూడా అరకొరగా విడుదల చేసేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నాడు–నేడు కార్యక్రమం ద్వారా శిథిలమైన బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, లైట్లు, మంచినీటి వసతి,


కరసనపల్లె పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఫర్నీచర్, అదనపు తరగతి గదులతో పాటు ప్రహరీ గోడలు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నాడు–నేడు పథకంతో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుండడంతో సర్వత్రా హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు

శంకర్రాయలపేటలో నాడు–నేడు ద్వారా నిర్మించిన స్కూల్ భవనాలు, ముదరంపల్లె, శివాడి, బొమ్మరాజుపల్లె, కురప్పల్లె, అప్పినపల్లె, పెద్దవెలగటూరు, రాజుపల్లె, కత్తార్లపల్లె, కరసనపల్లె, ముత్తుకూరు, శ్రీరామాపురం, పెద్దారికుంట, తొలిసెమ్మగుడి, భద్రాచలం, నగిరేపల్లె, కొళత్తూరు, నాగిరెడ్డిపల్లె, గొదమాకులపల్లె, రాయలపేట, పెద్దకాప్పల్లెలో నాడు–నేడు బడులు, అప్పినపల్లెలో రూ 20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, శివాడిలో రూ. 9 లక్షల గడప గడపకు నిధులతో చేసిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, సింగల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఎంఈఓ తులసీరామ్, వైద్యాధికారులు మురళీకృష్ణ, మురళి, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు సురేష్, ఎర్రబల్లి శ్రీనివాసులు, పార్టీ నాయకులు రాజారెడ్డి, గురునాథ్ రెడ్డి, మునిరాజా పాల్గొన్నారు.

అధికారులు మారినా..!


పాత పేర్లు, ఫోన్ నంబర్లతో ఉన్న స.హ చట్టం బోర్డు

రొంపిచెర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు మారినా సమాచార హక్కు చట్టం బోర్డులో వారి పేర్లు మాత్రం మారడం లేదు. ఇక్కడ డీటీగా పనిచేసిన మురాషావల్లి 6 నెలల క్రితం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ సౌమ్య బదిలీపై పాకాలకు వెళ్లారు. వీరి ఇద్దరు బదీలపై వెళ్లినా స.హ చట్టం బోర్డులో పేర్లు, ఫోన్‌నంబర్లను అలానే ఉంచారు. కొత్తగా వచ్చిన వారి పేర్లను నమోదు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. పలువురు సమాచారం కోసం వచ్చి ఆ నంబర్లకు ఫోన్ చేస్తున్నారు. మేము బదిలీపై వెళ్లిపోయామని అవతలి వైపు నుంచి సమాధానం వస్తోంది. పాత పేర్ల స్థానంలో ప్రస్తుతం పనిచేస్తున్న వారి ఫోన్ నంబర్లను నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు పలమనేరు మున్సిపల్ మీట్

పలమనేరు: పలమనేరు పురపాలక సంఘం సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర అధ్యక్షతన సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు హాజరుకావాలన్నారు. సమావేశంలో పలు అంశాలపై సభ్యుల ఆమోదంపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

ఏపీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పార్థసారథి



పలమనేరు: ఏఐసీసీ కార్యవర్గ సభ్యుడు, పలమనేరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత పార్థసారథి రెడ్డి ఏపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నుంచి శనివారం ఆదేశాలందాయి. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి పదవి నిచ్చిన పార్టీ అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

రేపటి నుంచి ధరణి డిపాజిట్ల సేకరణ

పుంగనూరు: పట్టణంలోని డీసీసీ బ్యాంకులో ఈనెల 16వ తేదీ నుంచి ధరణి డిపాజిట్ల సేకరణ చేపడుతున్నట్లు మేనేజర్ రాధారాణి తెలిపారు. బ్యాంకు సీఈఓ మనోహర్‌గౌడ్, చైర్మన్ రెడ్డెమ్మ ఆదేశాల మేరకు డిపాజిట్‌దారులకు 8 శాతం వడ్డీతో 450 రోజులకు డిపాజిట్లు సేకరించే కార్యక్రమం చేపట్టామన్నారు. సీనియర్ సిటిజన్లకు 8.50 శాతం వడ్డీ కల్పిస్తామన్నారు. రూ.1000 నుంచి డిపాజిట్లు స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 31 వరకు సేకరణ నిర్వహిస్తామన్నారు. డిపాజిట్లకు బీమా సౌకర్యంతో రక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు బ్యాంకులో సంప్రదించాలని కోరారు.

సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల: సహకార బ్యాంక్‌లో ధరణి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్నగొట్టిగల్లు సహకార బ్యాంక్ మేనేజర్ విజయకుమారి అన్నారు. అక్టోబరు 16 నుంచి 31వ తేదీ వరకు డిజపాజిట్లు చేసుకోవచ్చని తెలిపారు.

పలువురికి మంత్రి పెద్దిరెడ్డి పరామర్శ


సోమల: రాజారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



సదుం: వెంకట్రామిరెడ్డి మృతదేహానికి నివాళి, పులిచెర్ల: వగళ్లవారిపల్లెలో పరామర్శిస్తూ..

సోమల: మండలంలోని కామిరెడ్డిగారిపల్లె మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నేత ఎల్‌కేటీ రాజారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం పెద్దకర్మ సందర్భంగా అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని రాజారెడ్డి కుమారులు నిరంజన్‌రెడ్డి, క్రాంతికుమార్ రెడ్డిలకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వెంటేశ్వరరావు, ఎంపీపీ ఈశ్వరయ్య, పార్టీ మండల కన్వీనర్ గంగాధరం, ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, రవీంద్రరెడ్డి, మల్లికార్జున రెడ్డి, బెంగళూరు సాంబశివయ్య, బాషా మసూద్, జయరాం తదితరులు ఉన్నారు.

సదుం: మండల కేంద్రానికి చెందిన వెంకట్రామిరెడ్డి మృతదేహానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని వగళ్లవారిపల్లెకు చెందిన రమణారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే వంకమద్దివారిపల్లెకు చెందిన నారాయణ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాథమునిరెడ్డి, నాయకులు హేమసుంధరరెడ్డి, రాణెమ్మ, రాయల్ మోహన్, ప్రభాకర్, నాగరాజ ప్రసాద్, చంద్రశేఖరరెడ్డి, ప్రసాద్, గోవిందరెడ్డి ఉన్నారు.

జమ్ముగుండ్లపల్లెలో తాగునీటికి కటకట

బైరెడ్డిపల్లె: మండలంలోని కంభంపల్లె సచివాలయ పరిధిలోని జమ్ముగుండ్లపల్లెలో వారం రోజులుగా తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సుమారుగా 150 కుటుంబాలు ఉన్నాయి. రక్షిత నీటి సరఫరా పథకానికి సంబంధించి బోరు మోటారు పనిచేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. బోరులో పుష్కలంగా నీళ్లు ఉన్నప్పటికీ ఇక్కట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను నివేదించినా పట్టించుకున్న పాపానపోలేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి బోరు మోటారును రిపేరు చేయించి, తాగునీటి బాధలు లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజనాలబండలో విశేష పూజలు

చౌడేపల్లె: రాజనాలబండలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పాదముద్రలపై నిలబడి ప్రమాణాలు చేశారు. భక్తుల రద్దీతో ఆలయం పరిసరాలు కిటకిటలాడాయి.


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి